క్లుప్తంగా

నిర్వహణ నిధులు మంజూరు చేయాలి



సామల సింహాచలం

పార్వతీపురం టౌన్: మండల విద్యాశాఖ కార్యాలయాల నిర్వహణ నిధులను (ఎంఆర్‌సీ గ్రాంట్) విడుదల చేయాలని మండల విద్యాశాఖ అధికారుల అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. రవినాయక్ కోరారు. ఈ మేరకు మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్‌కు లేఖ పంపించామన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, ఎంఈఓ కార్యాలయాల నిర్వహణకు ప్రతి ఏడాదీ ఎంఆర్‌సీ గ్రాంట్ సమగ్ర శిక్ష ద్వారా మంజూరు చేస్తారని, అయితే గత విద్యా సంవత్సరం 2023–24 నుంచి నిర్వహణ గ్రాంట్స్ విడుదల చేయకపోవడంతో ఎంఈఓలు ఆర్థిక భారంతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఆఫీసు నిర్వహణకు సంబంధించిన విద్యుత్ చార్జీలు, ఇంటర్నెట్ చార్జీలు, స్టేషనరీ ఖర్చులతో పాటు వివిధ విద్యా కార్యక్రమాల నిర్వహణకు ఎంఈఓలు సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యను లేఖ ద్వారా విద్యా శాఖ మంత్రి లోకేష్‌కు తెలియజేశామని చెప్పారు.

పి.కోనవలసలో వారాల పండుగ



దేశమ్మతల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సాలూరు: పాచిపెంట మండలం పి.కోనవలసలో వారాల పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దేశమ్మతల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం గ్రామదేవత గంగమ్మతల్లికి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈమేరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అంటివలసలో తాగునీటి సమస్య



నిరుపయోగంగా మారిన కుళాయి

సాలూరు రూరల్: మండలంలోని అంటివలస ప్రజలు కొద్దిరోజులుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయిలు వేశారు. అయితే బోరు పాడవ్వడంతో కొద్ది రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ మండల నాయకులు

గరుగుబిల్లి: బీజేపీ(భారతీయ జనతా పార్టీ) మాతృ పార్టీ అయిన జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ మండల నాయకులు టి.శంకరరావు, పి.అశోక్ తదితరులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం పార్టీ స్థాపనకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొమరాడ: కోటిపాం జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 1997–98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా కలిసి, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి తీపిజ్ఞాపకాలను గుర్తుచేసుకుని, సరదాగా గడిపారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు రామచంద్రరెడ్డి, గంగునాయుడు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

గరుగుబిల్లి: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వై.అమన్నారావు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ఖడ్గవలస గ్రామ జంక్షన్ వద్ద సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించిన ఆయన.. అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారు మద్యం తాగినదీ లేనిదీ బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాల నడపరాదన్నారు.

అలసత్వం వహిస్తే
భారీ మూల్యం చెల్లించాల్సిందే..

- పాత వాహనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి
- రికార్డులు పరిశీలించుకున్న తర్వాతే నగదు లావాదేవీలు
- పేరు మార్పు వెంటనే చేయాల్సిందే..



పార్వతీపురం పట్టణ సమీపంలో రవాణా సిబ్బంది తనిఖీలు (ఫైల్)

పార్వతీపురం టౌన్:

ఇటీవల కాలంలో పార్వతీపురం పట్టణంలో నివాసం ఉండే ఓ ఉద్యోగి తన ద్విచక్ర వాహనాన్ని వేరే వ్యక్తికి విక్రయించాడు. కాని వాహనం విక్రయించిన తర్వాత వెంటనే రిజిస్ట్రేషన్ చేయలేదు. ఇంతలో ద్విచక్ర వాహనం కొనుగోలు చేసిన వ్యక్తి సారా రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. ఆ సమయంలో ద్విచక్ర వాహనానికి సంబంధించిన పత్రాలు ఉద్యోగి పేరుపై ఉండడంతో అతనిపై కూడా కేసు నమోదు చేశారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ఇలాంటి ఇబ్బందులు ఎంతోమంది అనుభవిస్తున్నారు. వాహనం అమ్మేశాం కాదా అని అలసత్వం వహిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. కొత్త వాహనాల కొనుగోళ్లు ఎంతలా జరుగుతున్నాయో.. పాత వాహనాల విక్రయాలు కూడా అంతే జోరుగా సాగుతున్నాయి. ఇదిలా ఉంటే వాహనాలను ఇతరులకు విక్రయించినట్లు సేల్ అగ్రిమెంట్, ఇతర పత్రాలన్నీ సరిగా చూసుకోకుంటే ఆ తర్వాత లేనిపోని చిక్కుల్లో పడాల్సి వస్తుంది. ఇటీవల పోలీసులు ఈ చలానా విధిస్తుండడంతో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాత వాహనాన్ని అమ్మిన సమయంలో బాండు పేపర్‌పై ఒప్పందం చేసుకుంటారు. వాహనాన్ని కొన్న వ్యక్తి కూడా తన పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకోకుండా అలాగే నడిపితే అమ్మిన వ్యక్తికి ఈ చలానా భారం పడుతుంది. ఈ విషయాన్ని వారు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వినే పరిస్థితి ఉండదు. కాగితాలను చూస్తేగాని నమ్మరు. అలాంటప్పుడు సేల్‌డీడ్ అగ్రిమెంట్ కాగితాలు ఉండడం మంచిది. సరైన అవగాహన లేకపోవడంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. అమ్మిన వారే గాక కొన్నవారు కూడా చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తోంది.

జోరుగా మారు బేరాలు..

పట్టణాలతోపాటు ఇటీవల మండల స్థాయిలో కూడా వాహనాల అమ్మకాలు, కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. మధ్యవర్తుల ఆధ్వర్యంలో ఇష్టం వచ్చినట్లు క్రయ విక్రయాలు సాగిస్తున్నారు. కొనుగోలు చేసిన వారు వారం, పది రోజుల్లోపు యాజమాన్య హక్కులను మార్చుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఆలస్యం చేస్తే అధికారులు జరిమానాలు విధించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

29, 30 ఫారాలే ముఖ్యం..

వాహనం కొన్న వెంటనే ఆర్‌సీ, బీమా, కాలుష్యం, చిరునామా లాంటి ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేయించుకోవడం చాలా ముఖ్యమని అధికారులు సూచిస్తున్నారు. వాటితో పాటు ఫారం 29 రెండు కాపీలు, ఫారం 30పై విక్రయించిన వారి సంతకాలు తీసుకుంటే యాజమాన్య హక్కుల బదిలీ సులభమవుతుంది. పాతవాహనం అమ్మేశాక యాజమాన్య హక్కులు బదిలీ చేసుకోకపోతే కష్టాలు తప్పవు. కొత్తగా మరో వాహనం కొన్నప్పుడు అదనపు ఇబ్బందులు ఎదురుకావు. ఈ విషయంపై అవగాహన లేకపోవడంతో ఎక్కువ పన్నులు చెల్లిస్తూనే ఉన్నారు. వాహనాన్ని అమ్మిన వెంటనే ఇరువైపులా యాజమాన్య హక్కులను మార్చుకోవాలి.

వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి..



పాత వాహనాలు కొన్న వెంటనే ఆర్‌సీ, బీమా, కాలుష్యం, చిరునామా లాంటి ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేయించుకుని పేరు, చిరునామా మార్చుకోవాలి. లేకపోతే అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలున్నాయి. వాహనానికి సంబంధించి పత్రాలు ఉన్నాయా, లేవా అనేది సరిచూసుకోవాలి. ట్రాఫిక్ చలానాలుంటే వెంటనే కట్టించాలి. నగదు లావాదేవీలు జరిగిన వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

– శశికుమార్, జిల్లా రవాణా శాఖాధికారి, పార్వతీపురం మన్యం

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా మలేరియా నివారణాధికారి జగన్ మోహనరావు



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి. జగన్‌మోహనరావు

పార్వతీపురం టౌన్: చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు. పట్టణంలోని ఏడో వార్డు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారుల్లో ఎవ్వరికైనా జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలయా అని ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే జిల్లా ఆస్పత్రిలో డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయించాలని సూచించారు. చిన్నారులకు సురక్షిత తాగునీరు, వేడి ఆహార పదార్థాలు అందించాలన్నారు. అనంతరం పిల్లల ఆరోగ్య నిర్వహణ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, ఏఎన్‌ఎం కిరణ్మయి, అంగన్‌వాడీ టీచర్ లత, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న చుక్క భాస్కరరావు

పార్వతీపురం: జాబ్‌మేళాలో ఉద్యోగం పొందిన యువత చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని భాస్కర్ విద్యాసంస్థల అధినేత చుక్క భాస్కరరావు అన్నారు. పట్టణంలోని భాస్కర్ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాకు వివిధ ప్రాంతాల నుంచి 150 మందికి పైగా యువత హాజరయ్యారు. ఈ జాబ్‌మేళాలో ఉద్యోగం పొందిన వారు అమేజాన్ వేర్‌హౌస్(చెన్నై)లో ప్యాకింగ్, స్కానింగ్, లోడింగ్, సార్టింగ్ తదితర విభాగాలలో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కొప్పల వెలమ సంఘ జిల్లా అధ్యక్షుడు చెల్లారపు రమేష్‌నాయుడు, సీహెచ్.జయప్రకాష్, కార్యదర్శి ఎం.కార్తీక్‌నాయుడు, తదితరులున్నారు.

పచ్చిరొట్ట పంటల పరిశీలన



పచ్చిరొట్ట పైరును రైతులతో కలిసి పరిశీలిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: పచ్చిరొట్ట సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారని మండల వ్యవసాయాధికారి ఎస్. అవినాష్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం, బుడ్డిపేట, నీలకంఠాపురం, వెంకటాపురం గ్రామాల్లో సాగువుతున్న పచ్చిరొట్ట పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పచ్చిరొట్ట పంటలైన జీలుగ, కట్టెజనుము, పిల్లిపెసరను సాగు చేసి దున్నడం వల్ల సేంద్రియ ఎరువు తయారవుతుందని, ఈ విషయమై రైతులకు అవగాహన కల్పించామని చెప్పారు. మండలంలోని రైతులకు 210 క్వింటాళ్ల జీలుగ, 120 క్వింటాళ్ల కట్టె జనుము, 5క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలు 50 శాతం రాయితీపై పంపిణీ చేశామన్నారు.

పంపిణీకి సిద్ధంగా మొక్కలు



తెల్లమద్ది మొక్కలు



పంపిణీకి సిద్ధంగా టేకు మొక్కలు

సీతానగరం: మండలంలో తొలకరి వర్షాలు కురవడంతో రైతులకు అవసరమైన మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని స్థానిక నర్సరీ నిర్వాహకుడు పి. చంటి తెలిపారు. మెట్ట ప్రాంతాలు, చెరువు గట్లపై, ప్రభుత్వ భూముల్లో, రోడ్లకు ఇరువైపులా నాటేందుకు టేకు, నీలగిరి, ఎర్ర చందనం, నేరేడు, ఉసిరి, బాదాం, కాగు, వేప, తెల్లమద్ది, గంగరావి, నెమలి నారు, పారిజాతం, బొడగ, కాగు మొక్కలు పలు నర్సరీల్లో ఉన్నాయని చెప్పారు. కావాల్సిన వారు సమీప నర్సరీలో సంప్రదించాలని సూచించారు.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి



శ్రీకాకుళం రహదారిలో వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై

పాలకొండ రూరల్: వాహనచోదకులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు అనుసరించాలని పాలకొండ ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. పాలకొండ–శ్రీకాకుళం, పార్వతీపురం అంతర్ రాష్ట్ర రహదారుల్లో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ప్రతీ వాహనానికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా ఒడిశా నుంచి పెద్ద ఎత్తున లారీలు పాలకొండ మీదుగా రాకపోకలు సాగిస్తున్న క్రమంలో ప్రమాదాలు సంభవించకుండా అవసరమైన చర్యలపై దృష్టిపెట్టామన్నారు. ఈ క్రమంలో వాహన తనిఖీలు ముమ్మరం చేసినట్లు చెప్పారు. వాహన చోదకులు డ్రైవింగ్ లైసెన్సు, అవసరమైన రికార్డులు వాహనంలో ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి అపరాదరుసుము విధించారు.

వరి నారుమడుల తయారీలో రైతులు



కూర్మరాజుపేటలో వరి విత్తనాలు చల్లుతున్న రైతు

సాలూరు రూరల్: మండలంలోని రైతులు వరి నారుమడుల తయారీలో నిమగ్నమయ్యారు. శనివారం కురిసిన వర్షానికి పల్లపు భూమి పదును సరిపోవడంతో పలు గ్రామాల రైతులు వరి విత్తనాలు చల్లటం ప్రారంభించారు. ఇదిలా ఉంటే రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు మొక్కజొన్న, పత్తి పంటలకు ఉపయోగపడతాయని రైతులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



హోమం చేస్తున్న దంపతులు

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో సుదర్శన హోమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి తదితర పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ సహకారంతో అర్చకులు సత్తె నరసింహాచార్యులు భక్తులతో సుదర్శన హోమం చేయించారు. ఈ హోమం చేస్తే సకల బాధలు తొలగి, మనసులో కోరిన కోర్కెలు నెరవేరుతాయని అర్చకులు తెలిపారు. హోమంలో పాల్గొన్న దంపతులకు దీక్షావస్త్రాలను కమిటీ సభ్యులు అందజేశారు. మధ్యాహ్నం దాతల సహకారంతో ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

గరుగుబిల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని లైబ్రేరియన్ ఎస్.మధుసూదనరావు ఆకాంక్షించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులకు మిత్రలాభం–మిత్రబేధం కథను చదివి, వినిపించారు. అనంతరం అందులోని నీతిని విద్యార్థులకు వివరించారు. ఆ తర్వాత పద్య పఠనంపై శిక్షణ ఇచ్చి, చిత్రలేఖనం, క్యారమ్ పోటీలు నిర్వహించారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఇప్పుడు ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డారని తెలిపారు. విద్య, క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.

కోటదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



వీరఘట్టం: భక్తులచే పూజలందుకుంటున్న దుర్గాదేవి

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటదుర్గమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో భక్తులు ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు.

- వీరఘట్టం: వీరఘట్టం ప్రజల ఇలవేల్పు కోటదుర్గమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు అమ్మవారికి సంబరాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

గురండిలో సంబరాలు

భామిని: మండలంలోని గురండిలో గ్రామదేవత సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, ఎజ్జోళ్ల నృత్యాల నడుమ మహిళలు ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని, పంటలు బాగా పండాలని ప్రార్థనలు చేశారు.



భామిని: గురండిలో ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు రూరల్ : మండలంలోని పీఎన్ బొడ్డవలసలో గల బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఆశీర్వాదం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని.. 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష సమయంలో ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీతో హాజరుకావాలని కోరారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.

విశాఖపట్నంకు డైరెక్ట్ బస్ వేయాలి

వీరఘట్టం: మండల కేంద్రం వీరఘట్టం నుంచి విశాఖపట్నంకు డైరెక్ట్ బస్సు సర్వీసు లేకపోవడంతో ఈ ప్రాంత ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరఘట్టం నుంచి పాలకొండ, రాజాం, శ్రీకాకుళం వెళ్లి అక్కడ నుంచి విశాఖపట్నం వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రాంత ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ యాజమాన్యం వీరఘట్టం నుంచి ప్రతిరోజు ఉదయం 5 గంటలకు విశాఖపట్నంకు బస్సు సర్వీసు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పార్వతీదేవికి ఉజ్జాపన పూజలు

బాడంగి: స్థానిక ఉమాసోమేశ్వరాలయంలోని పార్వతీదేవికి ఉజ్జాపన పూజలు ఆదివారం నిర్వహించారు. 41 వారాల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మండప పూజలు చేసిన మహిళలతో అర్చకులు ఈ ఉజ్జాపన పూజలు చేయించారు. తొలుత అమ్మవారి విగ్రహాన్ని పవిత్ర నదీజలంతో శుద్ధి చేసి, అనంతరం పంచామృతాలతో అభిషేకం చేశారు.

విత్తనశుద్ధి.. పైరుకు పుష్టి



విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

- విత్తన శుద్ధితో బహుళ ప్రయోజనాలు
- చీడపీడల నివారణతో పాటు, దిగుబడి రెట్టింపు

భామిని: ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కులు చేయడం, నారుమడులు సిద్ధం చేయడం, వరి విత్తనాల సేకరణలో బిజీగా ఉన్నారు. విత్తనాలు వేసుకునేముందు వాటిని శుద్ధి చేయడం ద్వారా చీడపీటల నుంచి రక్షణతో పాటు ఆశించిన పంట దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ సిబ్బంది సూచిస్తున్నారు. విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

విత్తనశుద్ధి ఇలా..

కిలో విత్తనానికి 1 గ్రాము కార్బండిజమ్ లేదా 2.5 గ్రాములు మాంకోజెట్ కలిపి శుద్ధి చేసుకోవాలి. విత్తనాలను శుద్ధి చేసేందుకు తగిన మోతాదులో మందులు వాడాలి. మోతాదు మించితే విత్తనాల మొలకశాతం తగ్గిపోయే అవకాశం ఉంది. శిలీంద్ర నాశిని పురుగు మందుతో శుద్ధి చేసిన తరువాత జీవ రసాయనాలతో మరోసారి శుద్ధి చేయాలి. గింజ పగలకుండా, పొర పోకుండా చూసుకోవాలి.

ప్రయోజనాలు..

నేల ద్వారా వ్యాపించే తెగుళ్లు, పురుగును సమర్థంగా నివారించేందుకు విత్తనశుద్ధి దోహదపడుతుంది. శుద్ధికి వినియోగించే మందులు విత్తనంలోకి చొచ్చుకుపోయి శిలీంద్రాలను నాశనం చేస్తాయి. మొలకెత్తిన లేత మొక్కలు నేలలో ఉన్న శిలీంద్రాల నుంచి రక్షణ పొందుతాయి. పురుగు మందుల వినియోగాన్ని తగ్గించుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చు.

విత్తనశుద్ధి తప్పనిసరి



వీరఘట్టం: ఖరీఫ్‌లో వరి సాగు చేపట్టే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జె.సౌజన్య సూచించారు. విత్తనశుద్ధి చేయడం వల్ల నారుపోసిన ప్రతీ గింజ మొలకెత్తుతుందన్నారు. దీని వల్ల రైతులకు వరినారు సమస్య లేకుండా ఉంటుందన్నారు. 30 కిలోల విత్తనాలకు 250 గ్రాముల సూడోమోనాస్ పౌడర్‌ను కలపడం ద్వారా విత్తనాల్లో ఉన్న శిలీంద్రాలు, క్రిమికీటకాలు నశిస్తాయన్నారు. ఫలితంగా వరినారు ఏపుగా పెరుగుతుందన్నారు. ఈ ఏడాది మండలంలో 15 వేల ఎకరాలకుపైగా వరి నాట్లు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు.

అవగాహన కల్పిస్తున్నాం..



వైఎస్సార్ పొలంబడిలో రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్నాం. విత్తనశుద్ధికి కావాల్సిన మందులు అందిస్తున్నాం. సూడోమోనస్ మందు 8 గ్రాములు ఒక కిలో వరి విత్తనానికి పట్టించి శుద్ధి చేసుకోవాలి. ఈ మందు జీవశిలీంద్ర నాశనిగా పనిచేస్తుంది.

– కిమిడి మన్మథరావు, ఎంఏఓ, భామిని

సూచనలు విధిగా పాటించాలి



రైతులు శాస్త్రవేత్తల, వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి. నాటే విత్తనాన్ని విధిగా శుద్ధి చేయాలి. దీంతో నారు మడుల దశలోనే చీడపీడలను నివారించవచ్చు. ప్రస్తుతం రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం. రైతులు మట్టి పరీక్షలు చేయించుకుని, ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వేసుకుంటే అధిక పంట దిగుబడులు పొందవచ్చు. రైతులకు సాగు సలహాలు, సూచనలు అందించేందుకు ఆర్‌బీకేల్లో వ్యవసాయ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు. వారి సేవలను వినియోగించుకోండి.

– కె.రత్నకుమారి, వ్యవసాయ సహాయ సంచాలకులు, పాలకొండ